క్లుప్తంగా

సీఎంను కలిసిన జిల్లా ఉపాధ్యక్షుడు



పర్వతగిరి : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు హైదరాబాద్‌లోని నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలం నుంచి గత శాసనసభ ఎన్నికల్లో పార్టీకి ఎనిమిది వేల మెజార్టీ రాగా పార్లమెంట్‌ ఎన్నికల్లో ఎవరికి టికెట్‌ ఇచ్చినా 10 వేల పైచిలుకు మెజార్టీ ఇస్తామని సీఎంకు అనిల్‌రావు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్‌



రాయపర్తి : రంజాన్‌ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని బీఆర్‌ఎస్‌ మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌ గుడిపూడి గోపాల్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని నూర్‌–ఏ–మజీద్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో గోపాల్‌రావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల సురేందర్‌రావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నయీం, చెవ్వు కాశీనాథం, అశ్రఫ్‌ పాషా, ఎంపీటీసీ ఐత రాంచందర్‌, ముద్రబోయిన సుధాకర్‌, పోగులకొండ వేణు, సదర్‌ సాహెబ్‌, హుస్సేన్‌, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్‌ పరీక్షలు



చెన్నారావుపేట : పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని అమీనాబాద్‌, చెన్నారావుపేట గ్రామాల్లోని పరీక్ష కేంద్రాల్లో నూరు శాతం విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని ఎంఈఓ రత్నమాల తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగియడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

‘క్రియాశీలక నాయకులకే ఎంపీ టికెట్‌ ఇవ్వాలి’



వర్ధన్నపేట : కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేసిన నాయకులకే వరంగల్‌ పార్లమెంట్‌ టికెట్‌ ఇవ్వాలని ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అధిష్టానాన్ని కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతమే ధ్యేయంగా దళితుల పక్షాన నమిండ్ల శ్రీనివాస్‌, దొమ్మటి సాంబయ్య క్రియాశీలకంగా పని చేశారని చెప్పారు. వారిలో ఒకరికి వరంగల్‌ ఎంపీ టికెట్‌ ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు చెరుపెల్లి బాబు, బంగారు సదానందం, ఎర్ర శ్రీకాంత్‌, శివరాత్రి వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామంలోని రంగనాయకులస్వామి గుట్ట ఆవరణలో చేపడుతున్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన జుట్టుకొండ సుజాతరాణి, కుమారుడు రమేష్‌ రూ.65 వేల 116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ బాధ్యులకు సుజాతరాణి, రమేశ్‌ శనివారం నగదు అందజేశారు. దాతలను కమిటీ బాధ్యులు అభినందించారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన ఇంగ్లి యాకయ్య, కడుదుల సోమనర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్‌

● ఓడీసీఎంఎస్‌ చైర్మన్‌ రామస్వామి



ఖానాపురం : మాట్లాడుతున్న చైర్మన్‌ రామస్వామి



దుగ్గొండి : మాట్లాడుతున్న చైర్మన్‌ రాజేశ్వర్‌రావు

ఖానాపురం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోల రుణాలు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పిస్తామని ఓడీసీఎంఎస్‌ చైర్మన్‌ రామస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 65వ మహాజన సభకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఖానాపురం సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పాలకవర్గ సహకారంతో ఐక్యంగా పని చేస్తామన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో బుధరావుపేటలో షాపింగ్‌ మాల్‌ నిర్మిస్తామని తెలిపారు. సొసైటీల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులకు చెప్పారు. సూచించారు. సొసైటీల బలోపేతానికి రైతులు తోడ్పాటు అందించాలని కోరారు. తొలుత రైతులు వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి వెంకటనర్సయ్య మాట్లాడారు. గతంలో అసైన్డ్‌ భూములకు రుణాలిచ్చారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని వెంకటేశ్వర్లు మహాసభ దృష్టికి తీసుకురాగా వెంకటనర్సయ్య మాట్లాడుతూ ఏ భూములున్నా రైతులకు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో సొసైటీ వైస్‌చైర్మన్‌ వేణు కృష్ణ, డైరెక్టర్లు గంగాధరి రమేశ్‌, ఆబోతు అశోక్‌ యాదవ్‌, జాడి అచ్యుతం, రవీందర్‌రావు, మేకల కుమారస్వామి, లక్ష్మణ్‌, భాగ్యలక్ష్మి, సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది మేరుగు రాజు, వినయ్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో ఆర్థిక ప్రగతి

దుగ్గొండి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో అన్నదాతలు ఆర్థిక ప్రగతి సాధించగలరని చైర్మన్‌ సుకినె రాజేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. సంఘం పరిధిలోని 12 గ్రామాల రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని చెప్పారు. నాచినపల్లిలో గోడౌన్‌ నిర్మాణం పూర్తి కాగా తిమ్మంపేటలో నిర్మాణ దశలో ఉందని తెలిపారు. మహాసభలో వైస్‌చైర్మన్‌ గుడిపెల్లి ధర్మారెడ్డి, డైరెక్టర్లు నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, బాబు, సదానందం, రాజు, పురుషోత్తం, మొకిడె ప్రభాకర్‌, సూరారెడ్డి, సునీత రాజ్‌కుమార్‌, భాస్కర్‌రెడ్డి, సాంబయ్య, సంజీవరావు, సీఈఓ ఓంకార్‌, సుధాకర్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ‘ఖాతాల’ సీజ్‌ దుర్మార్గం



గీసుకొండ : మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య



సంగెం : నిరసన తెలుపుతున్న నాయకులు

గీసుకొండ : కాంగ్రెస్‌ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ సీజ్‌ చేయడం దుర్మార్గమని ఎంపీపీ భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వరంగల్‌–నర్సంపేట రహదారిపై కొనాయమాకుల స్టేజి వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రతిపక్షాల పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేలా ఐటీ శాఖను గుప్పిట్లో ఉంచుకుని బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌ చేయించిందని ఆరోపించారు. బీజేపీకి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్‌, నాయకులు కూసం రమేశ్‌, నాగారపు స్వామి, ఎస్సీ సెల్‌ నాయకులు సంతోశ్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోలేకే..

సంగెం : కాంగ్రెస్‌ను ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోలేకే బీజేపీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌ చేయించిందని పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడారు. బీజేపీ ఎన్ని కుతంత్రాలకు పాల్పడ్డా పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధులు జనగాం రమేశ్‌, చాడ కొమురారెడ్డి, ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మెట్టుపెల్లి రమేశ్‌, యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఆగపాటి రాజు, మాజీ ఎంపీపీ కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలను స్తంభింపజేయడం సరికాదు

గీసుకొండ : కాంగ్రెస్‌ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేయడం సరికాదని ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్‌ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కాంగ్రెస్‌ పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేలా ఐటీ శాఖతో బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌ చేయించిందని ధ్వజమెత్తారు. బీజేపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం



చెన్నారావుపేట : బోనాలతో ఆలయానికి వెళ్తున్న గౌడ కులస్తులు



నల్లబెల్లి : ఆలయంలో పూజ చేస్తున్న గౌడ కులస్తులు

నల్లబెల్లి : మండల కేంద్రంలో కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ కుల పెద్దలు ఉదయమే ఆలయాన్ని దోర్నపాకుతో అలంకరించారు. అనంతరం పూజారి రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులపెద్దలు గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గాదెగాని రమేశ్‌, సభ్యులు ముత్యాల చిన్న కొమురయ్య, సట్ల శ్రీనివాస్‌, బూర రామన్న, చుక్క సాంబయ్య, సుద్దాల ఆనందం, ముత్యాల కుమార్‌, పెరుమాండ్ల కోటి, మేడిపల్లి ఐలయ్య, లక్ష్మణ్‌, సట్ల రమేశ్‌, అడుక అనిల్‌, పులి సిద్ధార్థ, కోయల వీరన్న, బూర సాయికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాలు

చెన్నారావుపేట : కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పాపయ్యపేటలో గౌడ కులస్తులు రాత్రి ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. తొలుత ఆలయానికి బోనాలతో తరలివెళ్లారు. అనంతరం బోనాలు సమర్పించి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కుల పెద్దలు మేడి ప్రభాకర్‌, అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ అధ్యక్షులు బండి రమేశ్‌, నాయకులు బుర్ర సుదర్శన్‌, బుడిగె నరేందర్‌, రామగోని రవి, మేడి సుధాకర్‌, గండు రాజు పాల్గొన్నారు.

మట్టి డంపర్లను అడ్డుకున్న రైతులు



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌ శివారు పెద్దగుట్ట నుంచి మట్టిని తరలిస్తున్న డంపర్లను స్థానిక రైతులు శనివారం అడ్డుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరు మట్టి డంపర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై గుగులోత్‌ వెంకన్న, తహసీల్దార్‌ వెంకటస్వామిని వివరణ కోరగా మైనింగ్‌ శాఖ నుంచి అనుమతులు ఉన్నట్లు తెలిపారు. మట్టి తరలించడానికి అనుమతి ఇవ్వొద్దని మైనింగ్‌ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్‌ నాయకురాలు తొర్రి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అనుమతి ఇవ్వొద్దని కోరారు. మైనింగ్‌ అధికారులను ఆదివారం కలువనున్నట్లు ఆమె వివరించారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత కీలకం



రాయపర్తి : రోడ్డు నిర్మాణంలో నాణ్యత కీలకమని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తిర్మలాయపల్లిలో చేపట్టిన డబుల్‌ సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతోందని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని, నాణ్యతను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ గజవెల్లి ప్రసాద్‌, వశపాక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో మార్నేని దంపతులు

వర్ధన్నపేట : నాబార్డు ప్రవేశపెట్టిన ఎంఎస్‌సీ పథకం కింద నందనం ఎఫ్‌ఎస్‌సీఎస్‌ ఆధ్వర్యంలో మండలంలోని బండౌతాపురంలో నిర్మించిన ఫంక్షన్‌ హాలులో డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు, ఐనవోలు ఎంపీపీ మధుమతి దంపతులు శనివారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, ఎలేంద్ర, చింత బాబు, చిరంజీవి, రారావు, కుమార్‌, మాదారపు సంపత్‌, బిర్రు పద్మ, పూజారి రాంచంద్రు, ఎలిశా, సమ్మయ్య, వరంగల్‌ డీపీఓ నాగేశ్వర్‌రావు, డీసీసీబీ డీజీఎం కురువానాయక్‌, నోడల్‌ అధికారి భద్రునాయక్‌, వర్ధన్నపేట శాఖ మేనేజర్‌ సమత, ఐనవోలు శాఖ మేనేజర్‌ శ్రవణ్‌, నాయకులు ఆడెపు దయాకర్‌, బుర్ర రాజశేఖర్‌, జోజిరెడ్డి, మునిగా సమ్మయ్య, అడ్డగూడి సతీశ్‌, జన్ను కుమారస్వామి పాల్గొన్నారు.

యేసుక్రీస్తు మార్గం అనుసరణీయం



రన్‌ ఫర్‌ జీసస్‌ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సెక్రెటరీ అశోక్‌



నృత్యం చేస్తున్న క్రైస్తవ భక్తులు

నల్లబెల్లి : ప్రపంచానికి యేసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని సీఎస్‌ఐ వరంగల్‌ గ్రూప్‌ సెక్రెటరీ ఆకుల అశోక్‌ అన్నారు. శాంతి, ప్రేమ మార్గాన్ని అనుసరిస్తూ సమాజంలోని ప్రతీఒక్కరూ యేసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలని ఆయన ఆకాంక్షించారు. యేసుక్రీస్తుకు సిలువ వేయబడిన మరుసటి రోజును పురస్కరించుకొని మండల పాస్టర్‌ ఫెలోషిప్‌ ఆధ్వర్యంలో మండలంలోని నల్లబెల్లిలో శనివారం నిర్వహించిన రన్‌ ఫర్‌ జీసస్‌ కార్యక్రమాన్ని అశోక్‌ ప్రత్యేక ప్రార్థన చేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎస్‌ఐ చర్చి నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవ భక్తులు నృత్యం చేస్తూ ఉత్సాహంగా నినాదాలు చేశారు. రెవరెండ్‌ ఈపీ.ప్రసాద్‌, రెవరెండ్‌ ముత్తయ్య, పాస్టర్‌ సాల్మన్‌ రాజు యేసుక్రీస్తు సిలువ మరణ పునరుత్థాన సందేశాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్‌ మాట్లాడారు. క్రీస్తు చూపిన బాటలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్ట్రేట్‌ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్‌, మాజీ సర్పంచ్‌ నానబోయిన రాజారాం, ఎంపీటీసీ జన్ను జయరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్‌, ఎంఎస్‌ ప్రభాకర్‌, కనుకం నవీన్‌, పరికి రత్నం, కల్లెపల్లి రఘువరణ్‌, మనుగొండ ప్రసాద్‌, కొండి అశోక్‌, పాడేటి సాగర్‌, ఈదునూరి బుచ్చయ్య, నాగెల్లి సాల్మాన్‌, స్త్రీల మైత్రీ సభ్యులు మనుగొండ శ్రీలత, కనుకం అనుష, నాగెల్లి అన్నమ్మ, జన్ను అరుణ, కనుకం రాధ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట ఏకశిల జంక్షన్‌ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలు తడుగుల సంపూర్ణ తీవ్ర గాయాలపాలైంది. ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా.. సంపూర్ణ తన అల్లుడు రాంబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై విధినిర్వహణలో భాగంగా వేలిముద్ర వేయడానికి గొర్రెకుంట క్రాస్‌ రోడ్డు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో సంపూర్ణ రెండు కాళ్లు విరిగిపోగా రాంబాబుకు స్వల్ప గాయాలయ్యాయి.

ఎమ్మార్పీఎస్‌ సదస్సును జయప్రదం చేయాలి

దామెర : ఏప్రిల్‌ 1న పరకాలలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్‌ నియోజకవర్గ స్థాయి సదస్సును జయప్రదం చేయాలని పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ మంద రాజు కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్‌, అనుబంధ సంఘాల సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు ముఖ్య అతిథిగా వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు జిల్లెల్ల మురళి, శంకర్‌, మండల అధ్యక్షుడు మధూకర్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం



ఆలయం నుంచి దేవతామూర్తులను తీసుకొస్తున్న భక్తులు

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం లక్ష్మీనృసింహస్వామి జాతరలో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం వైభవంగా సాగింది. స్వామివారితోపాటు అమ్మవార్లు ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీల దేవతామూర్తులను ఊరేగించారు. దేవతామూర్తులను అలంకరించిన రథంపై భక్తుల సందర్శన కోసం ఉంచారు. రాత్రి 10 గంటల తర్వాత కోనాపురం లక్ష్మీనృసింహస్వామి గోవిందా.. అంటూ భక్తుల నినాదాల నడుమ రథాన్ని గుట్ట చుట్టూ తిప్పారు. అర్చకులు కసివోజ్యల శివకృష్ణ చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండాల మహేందర్‌, మాజీ సర్పంచ్‌ వెల్దె సుజాత, నాయకులు సారంగం, ఆవుల రాములు, పురం మల్లయ్య, శివకుమార్‌, ఎడ్ల మధుసూదన్‌రెడ్డి, గంధం నాగరాజు, అనుమాండ్ల మల్లేశం, మండల అనిల్‌, బోనాల భద్రయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ అభ్యర్థిని గెలిపించాలి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

వర్ధన్నపేట : రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిని గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండలంలోని ఇల్లందలో శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వలాభం కోసమే కొందరు బీఆర్‌ఎస్‌ పార్టీని వీడుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ నాయకులపై కాంగ్రెస్‌ ప్రభుత్వం కేసులు పెట్టే ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చినవే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేర్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం హామీలే కాకుండా గత ప్రభుత్వ పథకాలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో ఉందని ఎద్దేవా చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ ఎన్నికల హామీలను విస్మరిస్తోందని చెప్పారు. పార్టీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో హెచ్‌ఎం, కోచ్‌, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని మండలంలోని ఉప్పరపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌ హెచ్‌ఎం జయ తెలిపారు. ఆ స్కూల్‌లో ‘రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ’ పేరుతో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జనవరి నుంచి మార్చి వరకు వారానికి మూడు రోజులు చొప్పున బాలికలకు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. టెక్నికల్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ ఇండియా కియో ‘ఏ’ గ్రేడ్‌ రెఫరి, బ్లాక్‌ బెల్ట్‌ సెవెంత్‌ డాన్‌. జపాన్‌ డిప్లమా సాధించిన కరాటే శిక్షకుడు రచ్చ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో 80 మంది బాలికలకు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. బాలికలు తమను తాము రక్షించుకోవడంతోపాటు శారీరక దృఢత్వం సాధించేలా, మానసికోల్లాసం కలిగించేలా కరాటే ఉపయోగపడుతుందని చెప్పారు. బాలికలు చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. కరాటేలో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు పొందడం అభినందనీయమని తెలిపారు. అనంతరం మాస్టర్‌ రచ్చ రవి మాట్లాడారు. విద్యార్థినులకు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్‌, సంతోశ్‌ కుమార్‌, బాలాజీరావు, ఉదయకుమార్‌, మాధవి, సుందర్‌, మురళి, రవీందర్‌, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘ఉపాధి’ పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి : జాబ్‌ కార్డు కలిగిన ప్రతీఒక్కరికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఎంపీడీఓ లెక్కల అరుంధతి ఆదేశించారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, వేసవి తాగునీటి ఎద్దడి, పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతులపై శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. ఏయే గ్రామాల్లో ఎంత మంది కూలీలు పనులు చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బావులను అద్దెకు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండలంలోని 49 పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్‌, ఏపీఓ శ్రీనివాస్‌, ఈసీ రాజు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ హ్యాట్రిక్‌ సాధించడం ఖాయం’

దామెర : కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్‌ సాధించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్‌ పగడాల కాశీప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు శనివారం బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్‌ ప్రతాప్‌రెడ్డి, వార్డు సభ్యులు చిల్లా రాజేందర్‌, గండు రాజు, పాలెపాక భిక్షపతి, పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, సీనియర్‌ నాయకులు మంద ఐలయ్య, మండల ప్రధానకార్యదర్శులు గన్ను సతీష్‌, వేల్పుల రాజ్‌కుమార్‌, సొసైటీ డైరెక్టర్‌ పొడాల మధూకర్‌, ముత్యాల సృజన్‌, పరుశరాం, తదితరులు పాల్గొన్నారు.